ఒక ప్రత్యేక విలేఖరి సమీక్ష

కొత్త ఉగాదికి ఆదుర్తి కొత్త 'ఎక్స్‌పెరిమెంట్'

ఈ 'సమీక్ష' రచయిత తెలుగు పత్రికాలోకానికి సుపరిచితులే, కాని ఆయనకోరికమీద పేరు వెల్లడించటం లేదు—సం.

ప్రముఖ బొంబాయి చిత్ర నిర్మాతలు పది పదిహేను మంది ఇటీవల ఒక ఉద్యమం తల పెట్టారు. కొత్త నాయికా నాయకు లిద్దరు ముగ్గురిని ఎన్నిక చేసి వారికి అందరూ తలొక అవకాశమూ యిచ్చి నిలబెట్టాలని. దానికై ప్రధాన నగరాలలో ఇంటర్వ్యూలు జరుప నిశ్చ యించారు. ఇటీవల వారిక్కడికి (హైదరాబాదు) వచ్చి ఈ విషయం మాట్లాడుతూ ఉండగా ఒక విలేఖరి బాబూ మూవీస్ వారి ప్రసక్తి తెచ్చాడు. వారు 'తేనె మనసులు' చిత్రంలో రెండు కొత్త మొహాలను పరిచయం చేస్తున్నారని, అంతేకాక మరో పదిమంది సహాయ నటులను కూడా ప్రవేశ పెడుతున్నారనీ, వారంతా కొత్తవారేనని చెప్పాడు.

కొద్ది క్షణాలపాటు ఎవరూ నమ్మలేక పోయారు. 'ఇంపాసిబుల్' అన్నారు ఒకరు. 'అసాధ్యం కాదు గాని పెద్ద విశేషమే .... ఇంత సాహసంతో ఇందుకు ఉద్యమించిన ఆ నిర్మాతను కలుసుకోవాలని ఉంది' అన్నారు సుల్తాన దర్శకుడు.

కాని "పొగరు మోతుబరి" (ఈ బిరుదాయన కిదివరకే ఎవరో యిచ్చారు) ఆదుర్తి సుబ్బారావుకు సాహసం అనేది సరదాగా చేసే పని. తాను నమ్మిన విద్యకోసం, తనకు నచ్చిన వృత్తికోసం తండ్రిడితో తగవాడి ఆస్తి వాటా వేసుకుని ఊరుకాని ఊరు వెళ్ళిపోయి, ఎండతోనూ, ఆకలితోనూ మాడి, వాన లోనూ, కన్నీటితోనూ తడిసి, కష్టపడి విద్య నేర్చుకుని నెగ్గుకు వచ్చిన జగమొండి ఆదుర్తి.

"ఏదో ఒక కొత్త, ఏదో ఒక ప్రత్యేకత ఉంటేనే



ఆదుర్తి సుబ్బారావు

ఏ కళాసృష్టికైనా ఆకర్షణ. దానికోసం చేసే కృషిని సాహసమన్నా, సరదా అన్నా, మరేమన్నా మీ యిష్టం" అన్నా రాయన సిగ్గుతో తల వంచుకుని, ఒక్క కాలరుతో మాత్రం గర్వ పడుతూ.

ఇవాళ 'తేనె మనసులు' చిత్రంలో ఆయన చేస్తున్నది ఏడెనిమిది లక్షల రూపాయల సాహసం, పాతిక ముప్పై చిత్రాల సాహసం, ఏడెనిమిది మాసాల సాహసం, పదిహేను, ఇరవై (మూగ మనసులులాగే) ప్రాణాల సాహసం. (దీని గురించి ఆంధ్రపత్రిక పాఠకులు ఇదివరకే చదివారు.)

ఈ సాహసోద్యమాన్ని యావదాంధ్రమూ ఆశీర్వ దించింది. యావత్ పరిశ్రమ అభినందించింది అగ్ర నటులంతా జయం ఆకాంక్షించారు. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్లు ఆమోదముద్ర వేశారు.



కాంచన, సుకన్య

కొందరు తొందరపాటుగా అనుకున్నట్టు అన్నట్టు ఇది ఉన్న నటులమీద నవాలు కాదు. ఆదుర్తి సర్వజన మిత్రుడు. ఆయన దక్షిణ భార తములోని అగ్రనటులు అందరితోనూ కలిసి పని చేశాడు, చేస్తున్నాడు, చేయబోతున్నాడు. పెరిగే మన పరిశ్రమకు మరికొందరు నటులవసరం. హాలీవుడ్‌లో పాతిక ముప్పై మంది హీరోలు న్నారు. ఆయా పాత్రలనుబట్టి ఆయా నటుల ఎన్నిక జరుగుతోంది. కథల వైవిధ్యం పెరుగు తోంది. అలాగే మన పరిశ్రమా పెరగాలని ఆయన సరదా

"అసలు కారణం—అన్నిటికన్న ముఖ్యమైనది చెప్పాలంటే—మూగమనసులు—ఘన విజయం సాధించింది. వెంటనే అంతటి చిత్రం—దానికి సరితూగేది నిర్మించడం కష్టం. అందువల్ల దానికి ఏవిధంగానూ పోలిక రానిది ఎన్నుకోవాలనిపించింది. అందరూ కొత్త నటులనే తీసుకుని బలమైన కథ అమర్చుకుని ప్రయత్నించాలనిపించింది" అన్నారాయన.


రెండు మాసాలపాటు రమణ, ఆదుర్తి, విశ్వం కలిసి చలనచిత్ర కథను రూపొందించారు. అది విన్నవారు బాగుందని మెచ్చుకుంటూ "దీనికి గనుక స్టార్ వాల్యూ తగిలిస్తే నీ చిత్రం సిల్వర్ జూబిలీయే" అన్నారు ఉత్సాహంగా.

నిజమే మంచి కథ దొరికినపుడు దాన్ని క్షేమంగా చూపడానికి పెద్ద నటులను తీసుకోవడం ఎంత సహజమో, కొత్తవారిని తీసుకోవడం కూడా అంతేను.

కొత్త నటులను ఆహ్వానిస్తూ ప్రకటన చేయ గానే—ఒకే ఒక్క ప్రకటన—నాలుగు వారాలలో అయిదువేల దరఖాస్తులు వచ్చాయి. వళ్ళెటూరి నాటక సమాజాల నుంచి, స్టార్ నాగేశ్వరరావు, రామారావుల వద్ద నుంచి, పట్నాలలో అమెచూర్ నాటక సంఘాల నుంచి, విద్యార్థులనుంచి, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, రంగూన్, సింగ పూర్ వంటి దూర ప్రాంతాలనుంచి, ఏడెనిమిది వందల జీతం తెచ్చుకుంటున్న ఉద్యోగస్తుల దగ్గర నుంచి పుంఖానుపుంఖాలుగా దరఖాస్తులు వచ్చాయి.

ఆదుర్తి, కో డైరక్టర్ విశ్వం, కామెరామెన్ సెల్వరాజ్, పి. ఎల్. రాయ్, రచయితలు ఆత్రేయ రమణ, ఎడిటర్ కృష్ణ అన్నిటినీ పరిశీలించి ఎన్ని కలు జరిపారు. కొందరికి లేఖలు వ్రాశారు. కొంద రిని ఆయా పట్టణాలకు వెళ్ళి ఇంటర్వ్యూ చేశారు. తరువాత మద్రాసు, హైదరాబాదులలో దాదాపు 150 మందికి స్క్రీన్ టెస్టులు (ఒక్కొ క్కరికీ ఒక్కొక్క పాత్ర యిచ్చి నటించమని, అది షూట్ చెయ్యడం) తీశారు. ఆ తర్వాత వార పది రోజులపాటు వాటిని పరీక్షచేసి సౌకర్యం చర్చించి, కథకూ, కథలోని పాత్రలకూ తగి వారిని ఎన్నుకున్నారు.

"మాకు వచ్చిన దరఖాస్తుదారులలో అర్హు ఇంకా చాలామంది ఉన్నారు. కాని, మా ఎన్ని ప్రధానంగా—మా కథకు, పాత్రలకు అనుగు ణమైన వ్యక్తులను దృష్టిలో ఉంచుకొని చేయ



సంధ్యారాణి, రామ్మోహన్

జరిగింది." అన్నారు ఆదుర్తి ఈ విషయం వివరిస్తూ.

తరువాత రెండు మూడు నెలలపాటు కొత్త నటులకు శిక్షణ కార్యక్రమం సాగింది. అందంగా, ఒడుపుగా కూర్చోవడం, లేవడం, నడవడం, పరుగెత్తడం వగైరా ప్రిల్లు దగ్గరనుండి రకరకాల వ్యత్యాల వరకూ—వచనం, సంభాషణలూ, పద్యాలూ, పాటలూ చదవటం నుంచి ఆయా సన్నివేశాలను నటించటం వరకూ అనేక అంశాలలో కట్టుదిట్టమైన శిక్షణ ఇచ్చారు. ఎవరికీ జంకూ, బెరుకూ లేకుండా ధైర్యంగా, ధీమాగా తిరిగి నటించే స్థాయికి తీర్చిదిద్దారు. వారికి కథ తెలియ జెప్పి, పాత్రల స్వభావ స్వరూపాలు విరుకపరచారు. అందరిచేతా ఆయా పాత్రలన్నిటినీ నటింపజేసి, విగ్రహం, నటన, తీరు అన్నీ పరిశీలించి ఆ ప్రకారం పాత్రలకు తగిన వారిని ఎన్నికచేశారు.

ఇందులో ముఖ్యపాత్రలు ఆరున్నాయి. వాటి జీవితరేఖలు ఒకదానికొకటి ఒరుసుకుంటూ పోయి, మెలివేసుకుని, చిక్కులుపడి విడి విడతాయి.

ఒక తండ్రి తనకూతురు పెళ్ళికోసం మరొక తండ్రి దగ్గర డబ్బు దోచాడు. అందువల్ల అతని కూతురుకు పీటల మీది పెళ్ళి ఆగిపోయింది. ఇటు దొంగ డబ్బుతో జరిగిన పెళ్ళికూడా ఫలప్రదం కాకుండా పోయింది ఆ డబ్బుతో విదేశాలకు వెళ్ళి వచ్చిన భర్త చిట్టిబాబు, ముద్దపప్పులాటి పెళ్ళాం తనకి పనికి రాదని కాలదన్ని వెళ్ళగొట్టాడు. తరువాత అతను తన కంపెనీలో తన సెక్రటరీగా పనిచేస్తున్న అమ్మాయి భానుమతిని ప్రేమించి ఆమె వెంట పడ్డాడు. అతని భార్య సీత భానుమతికి స్నేహితురాలే. తన యింటిపక్కనే ఉంటుంది. చిట్టిబాబుకి బుద్ధిచెప్పి, ఆలు మగలను కలిపి, వారి కాపరం నిలబెట్టాలని సంకల్పించి, గెలవటం కోసం వోటమిని నటించింది

ఈ ప్రయత్నంలో ఆమె ఎదురు చూడని పర్యవసానం ఒకటి ఏర్పడింది ఒకనాడు పీటలమీది పెళ్ళి ప్రోసి రాజుని, ఆమె ముఖమైనా చూడకుండా వెళ్ళిపోయిన బసవరాజు కూడా ఈనాడు ఈమెను చూసి ఎవరో అన్న భావంతో మన సిచ్చి పుచ్చుకున్నాడు. ఇంతలో ఈమె పెద్ద పదవిలో ఉన్న చిట్టిబాబు వెంట పడడంతో ఆమెను ద్వేషించి పగబట్టాడు. ఈ విచిత్ర పరిస్థితిని భానుమతి సాహసంతో చక్కబెట్టడమే ఈ కథకు పతాక ఘట్టం

చిట్టిబాబుగా రామ్మోహన్, రాజుగా కృష్ణమూర్తి, భానుమతిగా సుకన్య, సీతగా సంధ్యారాణి నటిస్తున్నారు, తండ్రు లిద్దరి పాత్రలను కోనేశ్వరశాస్త్రి, జి ఎస్. ఆర్ మూర్తి నిర్వహిస్తున్నారు చిట్టిబాబు అన్న, వదినలుగా వెంకటేశ్వరరావు, పుష్పకుమారి, బసవరాజు తల్లిదండ్రులుగా రాధాకుమారి, చలపతిరావు, తండ్రిపై అత్యద్భుతమైన ప్రభావంగల ఏడేళ్ళకూతురు చిన్నిగా రోజారాణి నటిస్తున్నారు

వీరేకాక చిత్రం పొడుగునా చిన్నచిన్న పాత్రలు ఎన్నో ఉన్నాయి వాటన్నిటికీ కూడా కొత్తవారే నటిస్తున్నారు వీ రందరినీ రంగులలో చూపడం మరో విశేషం. ఈస్ట్‌మన్ కలర్‌లో వచ్చిన మొట్టమొదటి తెలుగు సాంఘిక చిత్రం ఇదే.

ఇలా అన్ని పాత్రలకూ కొత్తవారినే వినియోగించి ఇంత ఖర్చుతో చిత్రం తీయడం దేశం మొత్తంమీద బహుశా యిదే తొలిసారేమో.

వీరందరినీ పరిచయం చేయడానికి వీరి వెనక దర్శకుడు ఆదుర్తి, రచయితలు ఆత్రేయ, రమణ, కామెరామన్ సెల్వరాజ్, సంగీత దర్శకుడు మహదేవన్ ప్రభృతులు పనిచేశారు.

చిత్రనిర్మాణం పూర్తి అయిన తరువాత మొన్ననే పూర్తి చిత్రం చూసుకున్నారట. అందులో పనిచేసినవారు, మిత్రులు కొందరు చూశారు. ఫలితం అత్యంత సంతృప్తికరంగా ఉంది.

ఆ తృప్తితో సంతోషంలో తరువాతి చిత్రం "విశాలనేత్రాలు"తో బాటు మరో చిత్రం నిర్మించడానికి నిశ్చయించారు. ఆ చిత్రానికి 'కన్నెమనసులు' అని పేరు కూడా పెట్టారు. అందులో ఈ చిత్రం తారలంతా నటిస్తారని చెప్పారు.

మొత్తంమీద కొత్త సంవత్సరంతోపాటు ప్రవేశిస్తున్న ఈ కొత్త నట బృందం ఈ కొత్త ప్రయత్నం విజయవంతం కావాలని సినిమా పరిశ్రమలోని వారూ, ప్రేక్షకులూ కూడా ఆకాంక్షిస్తున్నారు. ఈ చిత్ర విజయంలోంచి ఇంకా ఎన్నో కొత్త తరహా కథలూ, పాత్రలూ, కొత్తకొత్త పోకడలూ, రుచులూ జన్మించాలనీ తెలుగు వెలుగు చిత్రకళ కొత్త చిగురు తొడగాలనీ కొత్త పూలు పూయాలనీ ఆశిద్దాం. ★